గుర్తుకొస్తున్నాయి..!

- వైభవంగా అ'పూర్వ' సమ్మేళనం
- చెల్లూరు, పసలపూడి హైస్కూళ్లలో గుబాళించిన స్నేహ సౌరభాలు

రాయవరం: ఒకనాడు చదువులమ్మ చెట్టు నీడలో విద్యాబుద్ధులు నేర్చుకున్న స్నేహితులందరూ తిరిగి అదే చెట్టునీడన జ్ఞాపకాలతో సేదతీరారు. మండలంలోని చెల్లూరు, పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రాంగణాలు పూర్వ విద్యార్థుల కలయికకు వేదికలు అయ్యాయి. చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 1988–89 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 35 ఏళ్ల అనంతరం బుధవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. తొలుత సభావేదిక వద్దకు వెళ్లి ఒక్కొక్కరిగా పరిచయం చేసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలు, ఆటలు, అల్లర్లు, నిక్‌నేమ్‌లు జ్ఞప్తికి తెచ్చుకుని మరోమారు విద్యార్థులుగా మారిపోయారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు గుబ్బల భూషణం, గరిమెళ్ల చలమయ్య, ఉడతా సుబ్బారావు, పీవీ సుబ్రహ్మణ్యం, అకౌంటెంట్ సీహెచ్‌టీఆర్‌వీ ప్రసాదరావు, అటెండర్ వెలుదూటి సత్యనారాయణతో పాటుగా ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం జి.రాజ్యలక్ష్మిని పూర్వ విద్యార్థులు సత్కరించారు.

25 ఏళ్ల అనంతరం

పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1993–94 నుంచి 1997–98 విద్యా సంవత్సరం వరకూ ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుకున్న విద్యార్థులు 25 ఏళ్ల అనంతరం మరో మారు అదే పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. నాడు చదువుకున్న రోజులను గుర్తుకు చేసుకుని, నాడు విద్యాభ్యాసం చేసిన తరగతి గదుల్లో మరోమారు కూర్చుని నాటి విద్యార్థులుగా మారిపోయారు. పూర్వ విద్యార్థి సూర్యనారాయణరెడ్డి కుమారుడు మనోహరరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని గురువులకు వెండి పళ్లాలు బహూకరించారు. పూర్వ విద్యార్థి పోతంశెట్టి సూర్యనారాయణరెడ్డిని స్నేహితులందరూ సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కలయికకు కారకులైన పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు నల్లమిల్లి అమ్మిరెడ్డి, కె.సాయిరామ్మోహన్ రెడ్డి, టి.నాగబాబు, కె.దుర్గాప్రసాద్, ఎస్.వెంకటరెడ్డి, కె.రాజు, ఎం.ఎస్.కామేష్, పి.మాధవి, భవాని తదితరులకు బ్యాచ్ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

కాజులూరు: మండలంలోని కోలంక డీవీఆర్ఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1986–87లో పదో తరగతి పూర్తి చేసి పాఠశాల విడిచివెళ్లిన విద్యార్థులు సమావేశమై విందులు, వినోదాలతో ఉత్సాహంగా గడిపారు. 38 సంవత్సరాల తర్వాత ఆ నాటి సంగతులను నెమరు వేసుకుంటూ పాఠశాల అనంతరం వారి పరిస్థితులు, స్థితిగతులను మిత్రులకు వివరిస్తూ అనుభవాలను పంచుకున్నారు. వారి, వారి ప్రస్తుత హోదాలను మరచి కుటుంబసమేతంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాలలోనే ఆనందంగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. ఆనాడు వారికి విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

> **సౌతాఫ్రికా నుంచి వచ్చా**
>
> మూడున్నర దశాబ్దాల అనంతరం నాటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. మిత్రులందరినీ, నాటి గురువులను మరోమారు కలుసుకోవాలన్న తపన, ఆత్రుతతోనే దూరాభారాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చాను. ప్రస్తుతం సౌతాఫ్రికాలో స్థిరపడ్డాను.
>
> – కాటూరి మురళీ వెంకటరమణ, పూర్వ విద్యార్థి, సౌతాఫ్రికా


చెల్లూరు జెడ్పీ హైస్కూల్లో 35 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 2007–08 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 15 ఏళ్ళ తర్వాత బుధవారం సమావేశమయ్యారు. పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వివిధ ప్రాంతాల్లో, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా పూర్వపు పాఠశాలలో సమావేశమై ముచ్చటించుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ తమ కుటుంబ సభ్యులను పూర్వపు సహ విద్యార్థులకు పరిచయం చేసుకుంటూ సందడి చేశారు. నాటి గురువులకు పాదాభినందనలు చేసుకుని ఘనంగా సత్కరించారు. వారి వృత్తుల్లో స్థిరపడిన సంగతులను చెప్పుకున్నారు. చిన్నారులతో పాఠశాల ఆవరణలో ఆటపాటలతో సంతోషంగా గడిపారు.


పసలపూడిలో 25 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు


కోలంక డీవీఆర్ఆర్ ఉన్నత పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు


నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

క్లుప్తంగా

దుర్గేష్‌కు ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): సతీ వియోగంతో బాధపడుతున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణలు బుధవారం రాజమహేంద్రవరంలో పరామర్శించారు. దుర్గేష్ ఇంటికి వెళ్ళి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మండపేట పట్టణం, జెడ్.మేడపాడు, ద్వారపూడి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ళ పరామర్శించారు.

సామాజిక సాధికార యాత్ర వాయిదా


పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ఈనెల 21న ద్రాక్షారామలో జరిగే వైఎస్సార్ సీపీపీ సామాజిక సాధికార యాత్రను వాయిదా వేసినట్లు పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేయనున్నట్లు సూర్యప్రకాశ్ వెల్లడించారు.

నిబంధనలు పాటించాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

రామచంద్రపురం: వేగం కన్నా, గమ్యాన్ని చేరుకోవటమే ముఖ్యంగా ఉంటూ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజేంద్రప్రసాద్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ డిపో నందు ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవర్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. డిపో గ్యారేజీ డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో నాట్ల దశ కీలకం

కాజులూరు: వరి పంటల సాగులో నాట్లు దశ కీలకమైనదని ఏవో వి.అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించి రైతులకు నాట్లు వేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూడటం, పైపైనే నాట్లు వేయడం, కుదురుకు రెండు నుంచి మూడు మొక్కలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాటే ముందు వరిమొక్క సుతలను తుంచి నాటాలని దీనివల్ల ఆకు సుతల్లో ఉండే హిస్ప, కాండం తొలచు పురుగు గుడ్లు ప్రధాన పంటకు సోకకుండా జాగ్రత్త తీసుకున్నట్లవుతుందన్నారు.

శ్రీరామపురంలో ప్రభల తీర్థం


శ్రీరాంపురం చెరువుగట్టు వద్ద ప్రభల తీర్థంలో బందోబస్తు చేస్తున్న పోలీసులు

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర గ్రామ శివారు శ్రీరామపురంలో ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించారు. పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, మాచర, తదితర గ్రామాల దేవతా మూర్తుల ఆలయాల నుంచి ఊరేగింపుగా బయలుదేరిన ప్రభలు శ్రీరాంపురానికి చేరుకున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు తీర్థ మహోత్సవంలో పాల్గొన్నారు. అంగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జుత్తుగ నరసింహమూర్తికి నివాళి


కపిలేశ్వరపురం: యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామ శివారు మాచర మట్టలుకు చెందిన, కాకినాడలో స్థిరపడిన జిత్తుగ నరసింహమూర్తి మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం కాకినాడలో వృద్ధాప్యంతో మృతి చెందారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు డీవీ రాఘవులు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శిలు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు, సీపీఎం సీనియర్ నాయకులు జిత్తుక చిన వీర్రాజు, పెద్దింశెట్టి రామకృష్ణలు సంతాపం వ్యక్తం చేశారు. నరసింహమూర్తి మృతి ప్రగతిశీల ఉద్యమాలకు తీరనిలోటు అని అన్నారు.

మండపేటలో అంగన్‌వాడీల నిరసన

కపిలేశ్వరపురం (మండపేట): తమ డిమాండ్ల సాధనకు మండపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. తాము 37 రోజులుగా ఆందోళన చేస్తున్నామని సంబంధిత అధికారులు స్పందించి తమ డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇవ్వాలని వారు కోరారు. తమ ఆందోళనకు మద్దతుగా కోటి మంది సంతకాలు సేకరించే దిశగా ఆందోళనను ఉధృతం చేయనున్నట్టు సంఘం నాయకురాలు కె.కృష్ణవేణి తెలిపారు. అంగన్‌వాడీల ఆందోళన కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మద్దతుగా ప్రసంగించారు.

గ్రామాల్లో తీర్థాల సందడి

రాయవరం: పల్లెల్లో జాతర్ల సందడి చోటు చేసుకుంది. ఏటా పల్లెల్లో ఉన్న గ్రామ దేవతలకు ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఏడాదిలో ఏదో ఒక రోజున గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించినా, అధికంగా సంక్రాంతికి గ్రామదేవతలకు ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా వివిధ గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించారు. గ్రామ దేవతలకు భక్తులు పసుపు, కుంకుం, చీరలు, జాకెట్లు, నైవేద్యాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర్లకు నెల రోజుల ముందు నుంచి గ్రామదేవతలను గరగల రూపంలో ప్రతి రోజు ఊరేగించారు. పెద్ద పండుగ, కనుమ రోజులతో పాటు బుధవారం ముక్కనుమ రోజున కూడా ఉత్సవం నిర్వహించి తీర్థం నిర్వహించారు. రాయవరం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలను ఘనంగా చేపట్టారు. సోమేశ్వరం గ్రామ పరిధిలో ఉన్న చినతలుపులమ్మలోవ, సోమేశ్వరం దేవాంగులపేటలో పోతురాజు తీర్థం, శెట్టిబలిజ వీధిలో ఉన్న శ్రీముసళ్లమ్మ తల్లి, లొల్లలో బులిబాపనమ్మ, గోగులమ్మలకు జాతరను నిర్వహించనున్నారు. కూర్మాపురంలోని చెరువు వద్ద గ్రామదేవత పోలేరమ్మ తీర్థం, చెల్లూరులో మద్దెమ్మతల్లి, సత్తెమ్మతల్లి తీర్థం నిర్వహించారు. పలుచోట్ల అమ్మవారికి ఉత్సవ కమిటీ సభ్యులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.


సోమేశ్వరంలో భక్తుల నీరాజనాలు అందుకున్న శ్రీముసళ్లమ్మ తల్లి

ఘనంగా గొల్లాలమ్మ తీర్థం

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని అర్తమూరులో వేంచేసి యున్న గొల్లాలమ్మ తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. జాతరలో భాగంగా మంగళవారం రాత్రి గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారికి పూజలు చేశారు. అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మాజీ వైస్ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి దంపతులు, గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

కె.గంగవరం: ఏటిగట్టుపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. కూళ్ల నుంచి మసకపల్లి వరకు ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడం, దీనికి తోడు తప్పలు రోడ్డు మధ్య వరకు ఎదగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. గత నెల రోజుల నుంచి ఈ ఏటిగట్టుపై తుప్పల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక కాకినాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు, రావులపాలేనికి చెందిన మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పాటు పలు ప్రమాదాలు జరిగాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా కనపడకుండా తుప్పలు ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా మారాయని చేసేది లేక తామే స్వయంగా తుప్పలను తొలగిస్తున్నామని స్థానికులు అంటున్నారు. పూర్తి స్థాయిలో వీటిని తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.


కోట-కోటిపల్లి రోడ్డులో ఏపుగా ఎదిగిన తుప్పలను తొలగిస్తున్న స్థానిక యువకుడు

కనువిందు చేస్తున్న పల్లె వాతావరణం


కె.గంగవరం మండలంలో పచ్చదనంతో ఆకట్టుకుంటున్న పంట పొలాలు

కె.గంగవరం: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అనే నానుడికి అనుగుణంగా అటు జీవనశైలిలోను ఇటు పల్లె అందాల్లోను పట్టణ వాసులకు కనువిందు చేస్తుంది. మానవుని జీవన గమనంలో దాదాపు సుదీర్ఘకాలం పాటు వెన్నంటి వచ్చేది పల్లేలు మాత్రమే. ప్రస్తుతం పల్లె వాతావరణం పుడమితల్లికి పచ్చబొట్టు వేసినట్లు కనువిందు చేస్తుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న తరుణంలో నల్లగా కనిపించే భూమి మొత్తం పచ్చరంగుతో నిండి ఆహ్లాదాన్ని అందిస్తుంది. ఒకపైపు మంచుతో పల్లె వాతావరణం ఊటీని తలపిస్తుంది. పుడమి తల్లికి పచ్చబొట్లు పెట్టినట్లుగా పంట పొలాలు సంక్రాంతి పండక్కి పల్లెలకు వచ్చిన పట్టణ వాసులకు కనువిందు చేస్తున్నాయి.

మండలానికి 21,083 ఆరోగ్యశ్రీ కార్డులు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆదేశాలపై అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.రత్నకుమారి, పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. మండలంలోని 19 గ్రామాలకు గాను 21,083 కార్డులు మంజూరు కాగా వాటిలో 19,917 కార్డులు గ్రామాలకు చేరుకున్నాయి. వాటిలో 12,113 కార్డులను లబ్దిదారులకు అందజేసినట్టు ఎంపీడీఓ రామకృష్ణ వివరించారు. వానపల్లి పీహెచ్‌సీ పరిధిలోని కేదారిలంకలో 1,148 కార్డులు, వీరవల్లివారిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని అద్దంకివారిలంకలో 750 కార్డులు, అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని వల్లూరులో 1,303, వెదురుమూడి 767, కాలేరు 1,247, వడ్లమూరు 954, నల్లూరు 844, వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలోని మాచరలో 1,230, నేలటూరు 1,186, వాకతిప్ప 857, టేకి 1,960, కోరుమిల్లి 1,848, అంగర పీహెచ్‌సీ పరిధిలోని పడమర ఖండ్రిక 1,101, అంగర 2,829, కపిలేశ్వరపురం 2,346, తాతపూడి 713 కార్డులు మంజూరయ్యాయి. వాటిని త్వరితగతిన లబ్దిదారులకు అందజేసేందుకు కృషి చేస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు.

భీమేశ్వరస్వామి రథానికి సంప్రోక్షణ


భీమేశ్వరస్వామివారి రథానికి సంప్రోక్షణ చేస్తున్న వేదపండితులు, ఈఓ తారకేశ్వరరావు తదితరులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 20న స్వామి కల్యాణోత్సవం సందర్భంగా స్వామి రథానికి బుధవారం సంప్రోక్షణ చేశారు. ఆలయ పండితులు నిర్ణయించిన ప్రకారం ఉదయం 10.23 నిమిషాలకు స్వామివారి రథానికి సంప్రోక్షణ చేసి వేద మంత్రోచ్చారణల నడుమ బాజా భజంత్రీలతో శాస్త్రోక్తంగా రథాన్ని బయటకు తీశారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు, భక్తులు పాల్గొన్నారు.

మహిళల క్రికెట్‌లో ద్రాక్షారామ ముందంజ

రామచంద్రపురం రూరల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మహిళల క్రికెట్‌లో ద్రాక్షారామ జట్టు ముందంజలో ఉంది. బుధవారం జరిగిన ద్రాక్షారామ, కాపవరం సచివాలయాల క్రికెట్ పోటీల్లో ద్రాక్షారామ జట్టు విజయం సాధించి ముందంజలో ఉంది. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు సచివాలయ స్థాయిలో హోరాహోరీగా సాగుతున్నాయి. ద్రాక్షారామ పంచాయతీ కార్యదర్శి పలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, వ్యాయామోపాధ్యాయులు గెడ్డం అనునాధ, కోశెట్టి శ్రీనివాస్, ఎ.ఉమ, సీహెచ్ సుజాత, తోట నాగమణి, ఎస్.సత్యనారాయణ, ఎస్.మల్లేశ్వరి, స్వాతి, సచివాలయ ఉద్యోగులు పంచాయతీ సిబ్బంది పోటీలను పర్యవేక్షిస్తున్నారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు.


కాపవరం జట్టుపై గెలుపొందిన ద్రాక్షారామ మహిళల క్రికెట్ జట్టు

వైభవంగా వృక్షారామం వార్షికోత్సవం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరులోని శ్రీసత్య లక్ష్మణ దేవతా వృక్షారామం 8వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వృక్షారామం వ్యవస్థాపకుడు, ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్‌సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, అధిక సంఖ్యలో స్థానికులు హాజరయ్యారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మానవులకు, మొక్కలకు ఉన్న అవినాభావ సంబంధాన్ని చాటి చెబుతూ దేవతా వక్షారామాన్ని నెలకొల్పడం అభినందనీయమన్నారు. బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టిన రోజున తమ జన్మ నక్షత్రానికి సంబంధించిన మొక్కకు పూజలు నిర్వహించడం ద్వారా దైవానుగ్రహం పొందాలన్నారు. సప్తరుషులు, నవగ్రహాలు, నక్షత్రాలకు సంబంధించిన మొక్కలకు పూజలు నిర్వహించారు. సత్తి రామకృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వీరరాఘవరెడ్డి, లక్ష్మణరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, నల్లమిల్లి సతీష్, తాడి కోదండరామారెడ్డి, కోనాల సత్తిరెడ్డి పాల్గొన్నారు.


అర్తమూరులో పూజలు నిర్వహిస్తున్న బులిస్వామిరెడ్డి దంపతులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామచంద్రపురం రూరల్: పశులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులతో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి వెంకట్రావు అన్నారు. మండలంలో గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏరుపల్లి వెంకటాయపాలెం పశువైద్యశాలను ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు మండలంలో 11,900 డోసులకు గాను 5500 డోసులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, ఏడీ డాక్టర్ ఒ.రామకృష్ణ, మండల పశు వైద్యాధికారి ఎం.కృష్ణార్జున, వెల్ల పశువైద్యుడు పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి వెంకట్రావు తదితరులు

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలో రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా ఓటు వేసేందుకు అర్హులందరికీ ఓటుహక్కును కల్పించే దిశగా కృషి చేస్తున్నట్టు మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి వి.మదన్‌మోహన్‌రావు తెలిపారు. పట్టణంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారం రోజులుగా తమకు అందిన ఓటరు నమోదు దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. ఈవీఎంలు పనిచేసే విధానంపై ఓటర్లుకు అవగాహన కల్పిస్తున్నామని రాజకీయ ప్రతినిధులు సైతం ఆ దిశగా కృషి చేయాలని కోరారు. ఈనెల 22న ఫొటోఓటర్ల జాబితాను ప్రచురిస్తామన్నారు. 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించేందుకు సహకరించాలన్నారు.


మండపేటలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న మదన్‌మోహన్‌రావు

కారులో చెలరేగిన మంటలు


రామచంద్రపురంలో కారు నుంచి చెలరేగుతున్న మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రామచంద్రపురం: పట్టణ ప్రధాన రహదారి ముబారక్ హోటల్ ఎదురుగా మారుతీ 800 కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అందులో ప్రయాణిస్తున్న కారులోని కుటుంబ సభ్యులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. విద్యుత్‌నగర్‌కు చెందిన రాంబాబు ఇద్దరు పిల్లలతో కారులో వెళ్తుండగా ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. గమనించిన రాంబాబు పిల్లలతో సహా తాను ఏటీఎం నుంచి డ్రా చేసుకున్న రూ.లక్ష నగదుతో పాటు బయటకు వచ్చేశారు. మంటలను పట్టణ ఫైర్ సిబ్బంది అదుపు చేశారు. ప్రధాన రహదారిలో రాత్రివేళ ఘటన జరగడంతో ట్రాక్ జామ్ అయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వైద్యానికి రూ.13 వేల సాయం

కపిలేశ్వరపురం: మెదడు సంబంధిత వ్యాధితో విశాఖపట్టణంలో చికిత్స పొందుతున్న మండలంలోని అంగర గ్రామానికి చెందిన ఎస్ఎల్ఎన్‌బీఎస్ రావు చికిత్స ఖర్చుల నిమిత్తం రావులపాలేనికి చెందిన శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ ద్వారా రూ.13,000 ఆర్థిక సాయమందించారు. సంస్థ నిర్వాహకులు మానవత్వంతో అందించిన సాయంపట్ల ఎస్ఎల్ఎన్‌బీఎస్ రావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన పడవ పందేలు

ఆత్రేయపురం: గ్రామంలో జరిగిన సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ రాష్ట్రస్థాయి పడవల, ఈత పోటీలు బుధవారం ముగిశాయి. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చొరవతో చిర్ల యూత్ ఫోర్స్, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సెక్రటరీ ప్రకాష్ నిర్వహణ సారథ్యంలో మూడు రోజుల పాటు జరిగాయి. ఈ పడవలు, ఈతల పోటీలను ప్రజలు ఆనందోత్సాహాలతో వీక్షించారు. పడవల పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన ఎన్టీఆర్ కృష్ణా జిల్లా టీమ్‌కు రూ.లక్ష, రెండో స్థానం సాధించిన ఆత్రేయపురం, రావులపాలెం టీమ్ రూ.50 వేలు, మూడో స్థానం సాధించిన ఎన్టీఆర్ కృష్ణా జిల్లా టీమ్‌కు రూ.30 వేలు, ఈతల పోటీల్లో ప్రథమస్థానం సాధించిన ఎం.దొరబాబుకు రూ.10 వేలు, రెండోస్థానం సాధించిన ఎం.ప్రకాష్‌కు రూ.7 వేలు, మూడోస్థానం సాధించిన కామేష్‌బాబుకు రూ.3 వేలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. వినూత్నమైన ఈ పడవ పోటీలను మన ప్రాంతానికి పరిచయం చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి అందరూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. కాజులూరు మండలంలోని గొల్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని, గొల్లపాలెం, ఆర్యావటం, శలపాక, తణుకువాడ, డేగలపేట, మొగలిపాలెం, శీల, మంజేరు, చేదువాడ, బందనపూడి, మతుకుమిల్లి, తర్లంపూడి, జగన్నాథగిరి, పెనుమళ్ళ, అంద్రంగి, పెదపాటిగరువు గ్రామాలకు, కరప మండలంలోని గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. గృహ విద్యుత్ వినియోగదారులతో పాటు ఆక్వా, ఇండస్ట్రియల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.